ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 6 మార్చి 2024

తుఫాన్ బాధిత రైతులకు రూ.11.29 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

అనకాపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరులో తుఫాన్ ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలు నష్టపోయిన 28,247 మంది రైతులకు రూ.11.29 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా ప్రభుత్వ మంజూరు చేసిందని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తాడేపల్లి సీఎంఓలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారని, అనంతరం ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

- వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేస్తున్న రియల్టర్లు
- పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు నిల్
- నాలా, ఇతర పనులు చెల్లించకుండానే భూమి చదును పనులు
- ప్లాట్లుగా విభజించి గజాల చొప్పున అమ్మకం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న నియంత్రణ శాఖల అధికారులు

అనకాపల్లి మండలం కొండకొప్పాక వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెనకు సమీపంలో అవఖండం వ్యవసాయ భూముల్లో అనకాపల్లికి చెందిన ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి వంద ఎకరాల్లో భారీ లేఅవుట్ వేస్తున్నారు. నెల రోజుల నుంచి పనులు జోరుగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేస్తున్నారని స్థానికులు రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవడం లేదు.

పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీకి ఆనుకొని సుమారు 70 ఎకరాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే ఒక రియల్ ఎస్టేట్ సంస్థ లేఅవుట్ వేసింది. ఇప్పటికే భూమిని చదును చేసి ప్లాట్‌లుగా విభజించే పనులు చేపట్టారు. ఈ లేఅవుట్‌కు కూడా అనుమతులు లేవు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా పనులు ఆపేశారు.

ఇటువంటి అనధికార లేఅవుట్‌లు అనకాపల్లి మండలంలోనే కాకుండా జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన వున్న మండలాల్లో కోకొల్లలుగా వున్నాయి.



అనకాపల్లి మండలం కొప్పాక వద్ద జాతీయ రహదారికి సమీపంలో జోరుగా సాగుతున్న భారీ లేఅవుట్ పనులు



అనకాపల్లి మండలం బీఆర్‌టీ కాలనీలో గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో నిలిచిన లేఅవుట్ పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రధాన రహదారుల పక్కన, సమీపంలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రియల్టర్లు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, సంబంధిత శాఖల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా వ్యవసాయేతర అవసరాలకు మార్చేస్తున్నారు. ఇళ్ల స్థలాల లేఅవుట్‌లు వేసి, గజాల చొప్పున ప్లాట్‌లుగా వేస్తున్నారు. అయినా సరే ఏ ఒక్క శాఖ అధికారి కూడా పట్టించుకోవడంలేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది.

జిల్లాల పునర్విభజన తరువాత అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు ఈ జిల్లాపై కన్నేశాయి. ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేయడానికి జాతీయ రహదారి పక్కనున్న అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలతోపాటు నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారుల పక్కనున్న మండలాల్లో వ్యవసాయ భూములను ఎడాపెడా కొనుగోలు చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో చదును భూములను చదును చేస్తున్నారు. గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి, గ్రావెల్‌తో రోడ్లు నిర్మిస్తున్నారు. చుట్టూ గోడలు/ ఫెన్సింగ్ వేస్తున్నారు. ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో జాతీయ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో కూడా లేఅవుట్‌లు వెలుస్తున్నాయి. అనధికార సమాచారం ప్రకారం జిల్లాలోని వివిధ మండలాల్లో 350కిపైగా అనుమతులు లేని లేఅవుట్‌లు వున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లకు అన్ని అనుమతులు ... మిగతా 6వ పేజీలో

సీఎం నోట అదే పాట

విశాఖపట్నం వచ్చేస్తా... మూడేళ్లుగా ఇదే వరుస

- అదిగో, ఇదిగో...అంటున్న పార్టీ నేతలు
- తాజా ప్రకటన వెనుక రాజకీయ వ్యూహం
- త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనంటున్న రాజకీయ విశ్లేషకులు



'విజన్ విశాఖ' సావనీర్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత మూడేళ్లుగా ఏ వేదిక ఎక్కినా...'విశాఖపట్నానికి షిఫ్ట్ అవుతున్నా...మీరు కూడా రండి'...అంటూ చెబుతూ వస్తున్నారు. తన కేబినెట్‌లోని మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పార్టీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలతో ఇదే మాట పదేపదే చెప్పిస్తున్నారు. తాజాగా మంగళవారం నగరంలోని రాడిసన్ హోటల్‌లో 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించిన సదస్సులో కూడా ఇదే మాట చెప్పారు. తాను విశాఖపట్నం వస్తానంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, మీడియా వ్యతిరేక కథనాలు ప్రచురిస్తున్నదని, ఈసారి ఏదేమైనా సరే ఎన్నికలు ముగిసిన తరువాత ఇక్కడే నివాసం ఉంటానని, విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేశానని స్పష్టం చేశారు. విశాఖలో అన్ని వసతులు ఉన్నాయని ఒక వైపు ఒప్పుకుంటూనే ఈ ప్రాంతం వెనుకబడింది...అందుకే ఇక్కడి నుంచి పరిపాలన చేయాలనుకుంటున్నా, ఉత్తరాంధ్రాను ఉద్ధరిస్తా అంటూ మోసపూరిత మాటలు చెబుతున్నారు.

వస్తా..వస్తా అని చెప్పడం ఎందుకు..రావొచ్చుగా..?

- విశాఖలో ఉంటానంటూ సీఎం పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. తెలుగు సినిమా రంగానికి చెందిన ప్రముఖులంతా రెండేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. ఆ సమయంలో వారితో మాట్లాడుతూ కూడా 'నేను విశాఖకు మారుతున్నా. మీరు కూడా రండి. స్టూడియోలకు మంచి భూములు ఇస్తా' అని చెప్పారు.
- గత ఏడాది మార్చిలో విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. దానికి నెల రోజుల ముందు ఢిల్లీలో రోడ్ షో చేశారు. ఆ సమావేశంలో పాల్గొన్న సీఎం ఇతర రాష్ట్రాల పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను త్వరలోనే విశాఖకు మారుతున్నానని, మీరు కూడా రండి...అంటూ పిలుపునిచ్చారు. మార్చి 4వ తేదీన జరిగిన సదస్సులో కూడా త్వరలో విశాఖకు మారుతున్నానంటూ ప్రకటించారు.
- 2022 దసరాకు సీఎం విశాఖపట్నం వచ్చేస్తారని మంత్రి బొత్స సత్యనారాయణ పలు సందర్భాల్లో ప్రకటించారు.
- గత ఏడాది జనవరిలో విశాఖలో ఐటీ కంపెనీలు అన్నీ కలిసి మారియట్ హోటల్‌లో సదస్సు నిర్వహించాయి. ఆ సమావేశానికి హాజరైన ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఐటీ గురించి మాట్లాడకుండా, సీఎం ప్రస్తావన తీసుకువచ్చి, 'ఉగాదికి సీఎం ... మిగతా 5వ పేజీలో

ముఖ్యమంత్రి జిల్లాకు రాక రేపు

పిసినికాడలో చేయూత నిధులు విడుదల కార్యక్రమానికి హాజరుకానున్న జగన్

అనకాపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు అనకాపల్లి మండలం పిసినికాడ చేరుకుంటారు. వైఎస్ఆర్ చేయూత పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి 2.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

విద్యార్థుల అగచాట్లు

సీఎం సమావేశం కోసం ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు ఏలూరు వరకూ గల విద్యార్థులు నగరానికి తరలింపు - 5లో

కేంద్రం నిధులు దారి మళ్లింపు

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు పథకాల కింద రహదారుల కోసం వందల కోట్ల రూపాయలు కేటాయింపు
- ఒక్క సీఆర్ఐఎఫ్ కిందే ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు
- ఏడీబీ నుంచి రూ.150 కోట్లు
- పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిల్
- ఆ నిధులు ఇతర పథకాలకు వెచ్చించిన వైసీపీ ప్రభుత్వం



సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో నిర్మించిన కశింకోట-బంగారుమెట్ట రోడ్డు. కాంట్రాక్టర్‌కు ఇంతవరకు బిల్లు చెల్లించలేదు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల పునర్నిర్మాణం, మరమ్మతులను పూర్తిగా విస్మరించింది. రోడ్ల కోసం వేర్వేరు రూపాల్లో కేంద్రం అందించిన నిధులను కూడా పక్కదారి పట్టించింది. కాంట్రాక్టర్లకు రూ.వందల కోట్లు పెండింగ్‌లో పెట్టింది. దీంతో అనేక ప్రాంతాల్లో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు. ఆ మధ్య కాలంలో కోర్టు అక్షింతలు వేయడంతో కొంతవరకూ నాలుగో వంతు విడుదల చేసింది. ఇప్పటికీ సుమారు రూ.400 కోట్లు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు రెండేళ్లుగా గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఒక మంత్రికి సంబంధించిన బిల్లులు మినహా మరే బిల్లు క్లియర్ కావడం లేదని వాపోతున్నారు.

భారీగా బకాయిలు

కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట టెండర్లు పిలిచింది. అయితే బిల్లులు రావన్న ఉద్దేశంతో చాలామంది కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. వారితో ప్రభుత్వ పెద్దలు మాట్లాడి, ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కొంతమంది బిడ్లు వేశారు. కానీ ఆయా బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద జిల్లాకు కేంద్రం రూ.100 కోట్లు మంజూరుచేసింది. ఈ పనులను ఉమ్మడి జిల్లాలో నాలుగు భాగాలుగా విభజించి, ముగ్గురు, నలుగురు కాంట్రాక్టర్లు చేపట్టారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.15 నుంచి రూ.30 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే సీఆర్ఐఎఫ్‌కు సంబంధించి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా క్లియర్ చేయలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అలాగే న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) అందించిన రూ.150 కోట్లతో ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటివరకు రూ.30 కోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం..మరో రూ.120 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. అదేవిధంగా నాబార్డ్ అందించిన నిధులతో ... మిగతా 6వ పేజీలో



కబ్జాకు గురైన బీసీ సంక్షేమ భవన స్థలం

ప్రభుత్వ భూమి కబ్జా

మండల కేంద్రంలో 30 సెంట్లు ఆక్రమణ

- టీడీపీ హయాంలో బీసీ సంక్షేమ భవనం నిర్మాణానికి కేటాయింపు
- ఐదేళ్ల క్రితం నిధులు మంజూరు, శంకుస్థాపన
- ప్రభుత్వం మారడంతో గాలికొదిలేసిన వైసీపీ పాలకులు
- రూ.1.5 కోట్ల విలువైన స్థలం కబ్జా అవుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సబ్బవరం, మార్చి 5: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. పేదలు సెంటు భూమిని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుంటే ఆగమేఘాలపై పరుగులు తీసి, యంత్రాలతో నేల మట్టం చేసే రెవెన్యూ అధికారులు.. ప్రభుత్వ భూములను బడాబాబులు ఆక్రమించి పక్కా భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడంలేదు. తాజాగా బీసీ సంక్షేమ భవనం నిర్మాణానికి టీడీపీ హయాంలో కేటాయించిన భూమి సుమారు 30 సెంట్లు కబ్జాకు గురైంది.

సబ్బవరం సర్వే నంబరు 255లో డిగ్రీ కళాశాల, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి కేటాయించిన స్థలాలకు ఆనుకొని గత ప్రభుత్వం బీసీ భవనం నిర్మాణానికి 50 సెంట్లు స్థలం కేటాయించింది. భవన నిర్మాణానికి సుమారు రూ.25 లక్షలు బీసీ సంక్షేమ శాఖ నుంచి కేటాయించింది. 2019 ఫిబ్రవరి 14న అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు, బీసీ సంక్షేమ భవన నిర్మాణాన్ని అటకెక్కించారు. కాగా ఇక్కడ స్థలాలకు గిరాకీ పెరగడంతో బీసీ ... మిగతా 6వ పేజీలో

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

అభివృద్ధి పనులపై టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్రవాగ్వాదం

- పరస్పరం తోపులాట, బిగ్గరగా కేకలు
- మహిళా సభ్యుల జోక్యంతో శాంతించిన ఇరువర్గాలు



కౌన్సిల్ సమావేశంలో గొడవపడుతున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు



టిడ్కో లబ్ధిదారులకు డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించాలని చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, మార్చి 5: అభివృద్ధి పనులు, నిధుల వ్యయంపై మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, తెలుగుదేం పార్టీ కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్ పోడియం ఎదుట బాహాబాహీకి దిగారు. మూడో వార్డు కౌన్సిలర్ చెక్క బాలమ్మ, కోఆప్షన్ సభ్యురాలు రోజా వచ్చి ఇరుపార్టీల సభ్యులను శాంతింపజేశారు.

మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మునిసిపల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి 14 అంశాలతో ప్రధాన అజెండాతో పాటు ఏడు అంశాల టేబుల్ అజెండాను సమర్పించారు. అనంతరం 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, కొత్తవీధి బైపాస్ రోడ్డు సైడ్ వాల్ నిర్మించకుండా బీటీ రోడ్డు ఎందుకు వేశారని ప్రశ్నించారు. సైడ్ వాల్ లేకపోతే రోడ్డు కుంగి పోదా అని డీఈ నారాయణను నిలదీశారు. విగ్రహాలు పెట్టిన ప్రాంతంలో కూడా కాంక్రీట్ వేయలేదని, చెరువు మట్టి వేసి విగ్రహాలు పెట్టారని అన్నారు. ఇప్పటి వరకు ఎంత ఖర్చు అయ్యిందని ప్రశ్నించారు. డీఈఈ సమాధానం చెబుతూ.. సైడ్‌వాల్ నిర్మిస్తున్నామని, మొత్తం పని విలుక రూ.6 కోట్లుకాగా ఇంతవరకు రూ.3 కోట్లు ఖర్చు అయ్యిందని వివరించారు. కౌన్సిలర్ మధు మాట్లాడుతూ, మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో కాంక్రీట్ తడపడానికి శుద్ధి చేసిన తాగునీటిని వాడుతున్నారని, ఇందుకోసం కాంట్రాక్టర్ ఏమైనా డబ్బులు చెల్లించారా? అని ప్రశ్నించారు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే రోడ్డు తడపడానికి క్లోరినేషన్ చేసిన నీటిని వినియోగిస్తారా అనినిలదీశారు. మునిసిపల్ ఏఈ రవి సమాధానం ఇస్తూ.. కాంట్రాక్టర్ చేస్తున్న పనికి ఎంబుక్ రాస్తున్నామని ... మిగతా 6వ పేజీలో

వృథాగా సంపద కేంద్రాలు

- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- చెరువులు, రోడ్ల పక్కన చెత్త డంపింగ్

మాకవరపాలెం, మార్చి 5: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మండలంలో 12గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వీటిల్లో మాకవరపాలెం, జి.వెంకటాపురం, పెద్దిపాలెం, భీమబోయినపాలెం, గిడుతూరు, కొండలఅగ్రహారం, జి.గంగవరం, జి.కోడూరు, పైడిపాల గ్రామాల్లో సంపద కేంద్రాలను అప్పట్లోనే వినియోగంలోకి తీసుకువచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంపద కేంద్రాలు మూతపడ్డాయి. మరోవైపు వీధుల్లో సేకరించిన చెత్తను ఊరు చివర రోడ్లపక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. మాకవరపాలెంలో సేకరించిన చెత్తను



మాకవరపాలెంలో సేకరించి.. పాపయ్యచెరువులో పడేసిన చెత్తాచెదారం

సంపద కేంద్రం దగ్గరలో ఉన్న పాపయ్య చెరువులో పడవేస్తుండడంతో చెరువుఉ నీరు కలుషితమవుతున్నది. కొండల అగ్రహారంలో సేకరించిన చెత్తను బయ్యవరం వెళ్లే రోడ్డు పక్కన పడేసి నిప్పు పెడుతున్నది. దీని నుంచి వస్తున్న పొగతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



మాకవరపాలెంలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

క్రైం... crime news

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

నక్కపల్లి, మార్చి 5: మండలంలోని జానకయ్యపేటలో ఒక వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. జానకయ్యపేటకు చెందిన ఈగల నాగేశ్వరరావు కొన్నాళ్ల కిందట పెదతీనార్లకు చెందిన గుత్తుర్తి ఫైడిరాజుకు రూ.10 వేలు అప్పు ఇచ్చాడు. కొద్ది కాలం తరువాత అప్పు తీసుకున్న డబ్బులు తిరిగి తనకు ఇవ్వాలని నాగేశ్వరరావు కోరుతున్నాడు. కానీ ఫైడిరాజు ఇవ్వడంలేదు. ఈ నేపథ్యంలో సోమవారం జానకయ్యపేట-పెదతీనార్ల రహదారిపై ఇరువురు తారసపడారు. బాకీ విషయమై నాగేశ్వరరావు గట్టిగా అడగ్గా, ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఫైడిరాజు కత్తితో నాగేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 5: కులం పేరుతో దూషించారనే అభియోగంపై ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక శ్రీరామనగర్ కాలనీకి చెందిన కె.శాంతికుమారితో అచ్యుతాపురం మండలం మోసయ్యపేటకు చెందిన ఆమె వియ్యంకుడు అయిన అద్దేపల్లి ధన్యాలు, ఇతని అల్లుడు సిరిపురం సందీప్ ఫిబ్రవరి పదో తేదీన కుటుంబ విషయాల్లో గొడవ పడ్డారు. ఈ సందర్భంగా ధన్యాలు, సందీప్‌లు తనను కులం పేరుతో తిట్టినట్టు శాంతికుమారి సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పాముకాటుకు గురై మహిళ మృతి

రాంబిల్లి, మార్చి 5: మండలంలోని హరిపురం బీసీటీ కాలనీకి చెందిన కోమరు ధర్మ(30) పాముకాటుకు గురై మృతిచెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మంగళవారం ఉదయం బీసీటీ ఫామ్‌లో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరడంతో బీసీటీ ప్రతినిధులు వెంటనే చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది.

టీడీపీ నాయకుడి సరుగుడు తోటకు నిప్పు

▸ గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య



కోడూరులో దగ్ధమవుతున్న సరుగుడు తోట

మాకవరపాలెం, మార్చి 5: మండలంలోని జి.కోడూరు రెవెన్యూ పరిధిలో టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రొంగలి శంకర్‌గిరికి చెందిన ఐదు ఎకరాల సరుగుడు తోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఎరకన్నపాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న జి.కోడూరు రెవెన్యూలోని సరుగుడు తోటలో మంగళవారం 12 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల పనిచేస్తున్న రైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో వెంటనే ఆ భూమి రైతు శంకర్‌గిరికి సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడికి వచ్చేసరికి సుమారు నాలుగు ఎకరాల సరుగుడు తోట కాలిపోయింది. రైతుల సహకారంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని, ఐదు ఎకరాల సరుగుడు తోట కాలిపోయిందని శంకరగిరి వాపోయారు. అనంతరం చుట్టుపక్కల ఉన్న సరుగుడు తోటలకు ఈ మంటలు వ్యాపించాయి. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

పాయకరావుపేట, మార్చి 5: స్థానిక నాగరాజుపేట రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ వెల్లడించిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం నాగరాజుపేట రైల్వే గేటు వద్ద లింగాలతోట కాలనీ సమీపంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. ఇదే సమయంలో విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతను తెలుపురంగు చొక్కా, నీలం రంగు గడుల లుంగి ధరించి వున్నాడు. మోచేతిపై శివలింగం పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని, మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

▸ దేహశుద్ధి చేసిన బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు

▸ పోలీసు స్టేషన్‌లో అప్పగింత

మునగపాక (తుమ్మపాల), మార్చి 5: మండల కేంద్రంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థిని పట్ల అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడొకరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి సదరు ఉపాధ్యాయుడికి మంగళవారం పాఠశాలలో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక బాలికపట్ల అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. రానురాను శ్రుతిమించడంతో విద్యార్థిని మానసికంగా ఆందోళన చెందుతున్నది. దీంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. ఉపాధ్యాయుడు వేధిస్తున్నట్టు చెపింది. దీంతో కుటుంబ సభ్యులు, కొంతమంది గ్రామస్థులు కలిసి పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఈ సంఘటనపై డీఎస్పీ కె.సత్యనారాయణను వివరణ కోరగా, గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందిందని, విచారణ చేపడుతున్నామని చెప్పారు. బుధవారం క్షేత్రస్థాయిలో విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో పలు బెంగళూరు రైళ్లు

విశాఖపట్నం, మార్చి 5: తిరుపతి రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ కోసం దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు డివిజన్‌లో ఎయిర్‌కాన్ కోర్సు గిర్డర్ రోలింగ్ బ్లాక్ చేయనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 11, 18న ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (12890), ఈనెల 12, 14, 19, 21వ తేదీల్లో ఎస్ఎంవీటీ బెంగళూరు-హటియా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12836), ఈనెల 16న మంగుళూరు సెంట్రల్- సంత్రాగచి వివేక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22852) రైళ్లు వయా కట్పడి, అరక్కోణం జంక్షన్, రేణుగుంట మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల్లో ఎస్ఎం వీటీ బెంగళూరు- టాటానగర్ జంక్షన్ ఎక్స్‌ప్రెస్‌కు (12890) తిరుపతి చేరదు. అలాగే, ఎస్ఎంవీటీ బెంగళూరు-హటియా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12836), మంగుళూరు సెంట్రల్-సంత్రాగచి వివేక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22852) రైళ్లకు చిత్తూరు, తిరుపతి స్టేషన్లలో హాల్ట్‌ను తాత్కాలికంగా తొలగించారు.

గంటన్నర ఆలస్యంగా తిరుపతి డబుల్ డెక్కర్

విశాఖ నుంచి తిరుపతి వెళ్లే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ 22707) ఈనెల 11న గంటన్నర ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు. విశాఖలో రాత్రి 11.00 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు, 12.30 గంటలకు బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	112.00
లైవ్ ధర	132.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	244.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

రూ.200 ఇస్తేనే డెత్ సర్టిఫికెట్

▸ అదనంగా కాపీలు కావాలంటే ఒక్కొక్కటి రూ.100

▸ ఈవోపీఆర్డీ కార్యాలయంలో సాగుతున్న దందా



మాకవరపాలెంలో మంజూరు చేసిన మరణ ధ్రువీకరణ పత్రం

మాకవరపాలెం, మార్చి 5: మరణ ధ్రువీకరణ పత్రం కావాలంటే మండల పరిషత్ కార్యాలయంలోని ఈవోపీఆర్డీ ఆఫీసు సిబ్బందికి రూ.200 సమర్పించుకోవలసిందే. మండలంలో కొన్ని చోట్ల సచివాలయాల్లో ఈ పత్రాన్ని ఇస్తుండగా, మరికొన్ని ప్రాంతాలకు సంబంధించి ఈవోపీఆర్డీ కార్యాలయంలోనే సర్టిఫికెట్ ఇస్తున్నారు. ఇక్కడికి వెళ్లిన వారు డబ్బులు ఇవ్వనిదే పని జరగడం లేదు. ఈ విషయం ఈవోపీఆర్డీకి తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలంలోని శెట్టిపాలెం, రాచపల్లి, జి.కోడూరు, గిడుతూరు, తామరం, సచివాలయాల్లో మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారు. అయితే మాకవరపాలెం, లచ్చన్నపాలెం, బూరుగుపాలెం, పీపీఅగ్రహారం, తూటిపాలతో పాటు మరికొన్ని సచివాలయాలకు చెందిన మరణ ధ్రువ పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో గల ఈవోపీఆర్డీ ఆఫీస్‌లోని పంచాయతీ కార్యదర్శి లాగిన్ ద్వారా మంజూరు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ నిబంధన ప్రకారం మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా ఇవ్వాలి. ఎక్కువ కాపీలు కావాలంటే చలానా కట్టి తీసుకోవాలి. అయితే ఇక్కడి సిబ్బంది ఈ నిబంధనలు పాటించడం లేదు. సర్టిఫికెట్ కావాలంటే రూ.200, అదనంగా కాపీలు కావాలంటే ఒక్కొక్కటి రూ.100 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మాకవరపాలెం గ్రామానికి చెందిన పంచదార్ల గురవయ్య గత నెల 22న మృతి చెందాడు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం అతని కుమారుడు పంచదార్ల ఏసుబాబు ఈ నెల 2న మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాడు. సర్టిఫికెట్ కావాలని అక్కడ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌ను అడిగాడు. సర్టిఫికెట్ కావాలంటే రూ.200, అదనంగా కాపీలు కావాలంటే ఒక్కొక్కటి రూ.100 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆపరేటర్ అడిగిన విధంగానే చెల్లించి సర్టిఫికెట్ తీసుకున్నాడు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి వివరణ కోరగా మరణ ధ్రువపత్రాన్ని ఉచితంగానే ఇస్తామని, అయితే అదనంగా కాపీలు కావాలంటే పంచాయతీ తీర్మానం చేసిన ప్రకారం రుసుము చెల్లించి చలానా తీసుకోవాలన్నారు. అయితే సర్టిఫికెట్ కోసం రూ.200 తీసుకుంటున్నారని ఆమె దృష్టికి తీసుకురాగా సమాధానాన్ని దాటవేశారు.

సీఎం పర్యటన.. ప్రజల పాట్లు

▸ హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం విద్యుత్ వైర్లు మార్పు

▸ కశింకోటలో ఉదయం నుంచి రాత్రి వరకు సరఫరా నిలిపివేత

▸ ఎండవేడి, ఉక్కపోతతో జనం తిప్పలు

▸ నిరుపయోగ భవనాలకు రంగులు



నిరుపయోగంగా వున్న పౌరసరఫరాల సంస్థ గోదాముకు సున్నం వేస్తున్న కార్మికులు

కశింకోట, మార్చి 5: 'ఎంకి పెళ్లి.. సుబ్బి చావుకొచ్చిందన్న' చందంగా వుంది అనకాపల్లి వాసులకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పర్యటన. ఈ నెల 7వ తేదీన పిసినికాడలో చేయూత పథకం నిధుల విడుదల సభలో సీఎం పాల్గొంటారు. అయితే కశింకోట మండల కేంద్రంలో ప్రజలకు రెండు రోజుల ముందే తిప్పలు మొదలయ్యాయి. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అడ్డుగా వున్న విద్యుత్ లైన్లు మార్చేందుకు మంగళవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విధించారు. సాయంత్రం ఆరు గంటల తరువాత ప్రాంతాల వారీగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవడం, దీనిపై ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎండ మండిపోవడంతో ఇళ్లల్లో ఉక్కపోతతో సతమతం అయ్యారు.

నిరుపయోగ భవనాలకు రంగులు!

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కశింకోట మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి చుట్టూ మండల పరిషత్ కార్యాలయం, బీసీ హాస్టల్, ఎంఆర్‌సీ భవనం, పౌరసరఫరాల సంస్థ గోదాము, తదితర భవనాలు వున్నాయి. వీటిన్నింటికీ ఆయా శాఖల అధికారులు హడావుడిగా రంగులు వేయిస్తున్నారు. వీటిల్లో పౌరసరఫరాల సంస్థ గోదాము, రెవెన్యూ కార్యాలయం రికార్డుల గది చాలా కాలం నుంచి నిరుపయోగంగా వున్నాయి. వీటికి కూడా రంగులు వేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని ప్రభుత్వ భవనాలు ఎన్నో వున్నాయని, వాటిని బాగు చేయించకుండా పాత భవనాలకు రంగులు వేయించడంపై విస్మయం చెందుతున్నారు. ఇదిలావుండగా సభ ప్రాంగణానికి సమీపంలో ఉన్న ప్రైవేటు స్థలాలను తమ అనుమతులు లేకుండా చదును చేస్తున్నారని ఆయా యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమావేశం



ఆర్డీవోతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

కశింకోట, మార్చి 5: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 7వ తేదీన చేయూత పథకం 4వ విడత నిధులు విడుదలకు సంబంధించి అనకాపల్లి మండలం పిసినికాడలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ ఏర్పాట్లపై కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. సుమారు ఎనిమిది ఎకరాల్లో సీఎం సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల నిలుపుదలకు మరికొంత స్థలాన్ని చదును చేస్తున్నారు. సాయంత్రం హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఆయన వెంట ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేశ్, డీఈ ధనుంజయ్, ఏఈ శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు, తహసీల్దార్ మధుసూదన, ఎంపీడీవో శేషుబాబు తదితరులు వున్నారు.

విద్యార్థుల అగచాట్లు

▸ సీఎం సమావేశం కోసం ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు ఏలూరు వరకూ గల విద్యార్థులు విశాఖకు తరలింపు

▸ ఉదయం 9 గంటలకు కన్వెన్షన్ హాలులోకి పంపించిన అధికారులు

▸ మధ్యాహ్నం 3.30 గంటల వరకు లోపలే...

▸ ఆకలితో విలవిల్లాడిన విద్యార్థులు

▸ ఆలస్యంగా వచ్చారని అనుమతించకపోవడంతో బయటే ఉండిపోయిన పలువురు



కాకినాడ నుంచి వచ్చిన విద్యార్థులను లోపలికి అనుమతించకపోవడంతో వెనక్కి వెళ్లిపోతున్న దృశ్యం

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పోతినమల్లయ్యపాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో 'ది కాస్కేడింగ్ స్కిల్స్‌-భవిత' పేరిట నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సభకు సీఎం హాజరవుతున్నారని ప్రభుత్వం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులను రప్పించింది. వివిధ కోర్సులు పూర్తిచేసిన, శిక్షణ పొందిన, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు/ యువకులను కార్యక్రమానికి తప్పనిసరిగా పంపించాల్సిందిగా ఆయా కళాశాలలు, సంస్థలకు అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. విద్యార్థులను తీసుకువచ్చే బాధ్యతను కూడా ఆయా శిక్షణ సంస్థలు, కాలేజీలకే అప్పగించారు. ఇటు ఇచ్ఛాపురం నుంచి అటు ఏలూరు, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులను ఈ సమావేశానికి తీసుకువచ్చారు. సీఎం పన్నెండు గంటలకల్లా కన్వెన్షన్ సెంటర్‌కు వస్తారంటూ...అంతకు మూడు గంటలు ముందే అంటే ఉదయం తొమ్మిది గంటలకే విద్యార్థులను లోనికి పంపించారు. కానీ, ఆయన మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో వచ్చారు. దాదాపు రెండు గంటలపాటు సభలో పాల్గొన్నారు. కార్యక్రమం పూర్తయ్యేసరికి మధ్యాహ్నం 3.30 అయ్యింది. సుమారు ఆరున్నర గంటలపాటు కన్వెన్షన్ హాలులో ఉండాల్సి రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామంది విద్యార్థులకు స్నాక్స్, మంచి నీరు కూడా అందకపోవడంతో ఆకలితో అలమటించారు. మధ్యాహ్నం 3.30 గంటల తరువాత బయటకు వచ్చిన విద్యార్థులకు 'వి' కన్వెన్షన్ ప్రాంగణంలో భోజనం ఏర్పాట్లు చేయలేదు. అక్కడే ఉన్న పలువురు అధికారులను భోజనం గురించి ఆరా తీయడంతో...వచ్చిన బస్సుల్లో ఏర్పాటు చేశామని సమాధానం ఇచ్చారు.

బయటే ఉండిపోయిన విద్యార్థులు

ఈ సభలో పాల్గొనేందుకు కాకినాడ, ఏలూరు నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు కన్వెన్షన్ హాలు బయటే ఉండిపోయారు. సమయానికి రాకపోవడంతో పోలీసులు వారిని అనుమతించలేదు. ఐడీ కార్డులు ఉన్నాయని చెప్పినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు కన్వెన్షన్ హాలు బయట ఉన్న చెట్ల కింద ఉండిపోయారు. కొందరు తాము వచ్చిన బస్సుల్లోకి వెళ్లి కూర్చున్నారు. అంత దూరం నుంచి కష్టపడి వస్తే కనీసం లోపలకు పంపించకపోవడం దారుణమని, ఆ మాత్రం దానికి తీసుకురావడం ఎందుకని పలువురు ప్రశ్నించారు.

సీఎం సభకు డెలిగేట్లుగా సచివాలయ సిబ్బంది

▸ ఏయూ ప్రొఫెసర్లంతా అక్కడే మకాం

▸ విశాఖ పారిశ్రామికవేత్తలు ముఖం చాటు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'విజన్ విశాఖ' పేరుతో నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం సమావేశానికి సచివాలయ సిబ్బందిని కూడా డెలిగేట్లుగా పంపించారు. ఈ సమావేశానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారితో కలిపి రెండు వేల మంది హాజరవుతారని ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. విశాఖలో పారిశ్రామికవేత్తలందరినీ రావాలని పిలుపునిచ్చారు. ఏపీఐఐసీ అధికారులు, కలెక్టర్ కార్యాలయంలోని అధికారులు నగర పారిశ్రామికవేత్తలకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. ఒక్కొక్కరికి మూడుసార్లు ఫోన్లు చేశారు. కన్‌ఫర్మ్ చేయాలని పదేపదే కోరారు. చాలామంది తాము రావడం లేదని చెబితే, కారణం ఏమిటి?, అంటూ అధికారులు ఎదురు ప్రశ్నించారు. కొందరు ఆరోగ్యం బాగా లేదని, ఊళ్లో లేమని చెప్పారు. మరికొందరు...ఏ కారణమో ఎందుకు చెప్పాలి?...ఎదురు ప్రశ్నించారు.

తాము ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని, అందుకే కారణాలు అడుగుతున్నామంటూ ఫోన్లు చేసిన వారు వాపోయారు. ఈ సమావేశానికి విశాఖలో సగం మంది పారిశ్రామికవేత్తలు హాజరుకాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్లు అంతా సూట్లు వేసుకొని సమావేశానికి వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పదుల సంఖ్యలో హాజరయ్యారు. రెండు వేల మందికి ఏర్పాట్లు చేయగా సగం సీట్లు ఖాళీగా ఉండిపోవడంతో సచివాలయాల సిబ్బందిని పంపించారు. వారికి పాస్‌లు అందించే బాధ్యతను మధురవాడ సచివాలయ సిబ్బందికి అప్పగించారు. దాంతో వారు హోటల్ బయట ప్రహరీ దగ్గరే ఉండి, వచ్చిన వారికి పాస్‌లు ఇచ్చి లోపలకు పంపించారు. అలాగే కేటరింగ్‌లు నడిపేవారిని, పర్యాటకులకు కార్లు అద్దెకు ఇచ్చే వారిని, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు విక్రయించే వారిని తీసుకువచ్చి సీట్లు నింపేశారు. ముందు వరుసల్లో మంత్రులు, అధికారులు కూర్చొని, ఆ తరువాత సూట్లు వేసుకున్న అధికారులు, పారిశ్రామికవేత్తలను కూర్చోబెట్టి...ఆ తరువాత అంతా ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చిన వారిని కూర్చోబెట్టారు.

వలంటీర్ల చందాల దందాపై విచారణ



కుసర్లపూడి గ్రామ సచివాలయంలో విచారణ చేపడుతున్న ఈవోపీఆర్డీ నూకరాజు

రోలుగుంట, మార్చి 5: గ్రామ దేవత జాతర పేరిట పింఛన్‌దారుల నుంచి వలంటీర్లు బలవంతంగా చందాలు వసూలు చేసిన ఘటనపై మండలంలోని కుసర్లపూడిలో మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల నుంచి సామాజిక పింఛన్‌లో సగం నగదును తీసుకోవడంపై సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మాజీ సర్పంచ్ గండి తాతాజీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే మండల ఈవోపీఆర్డీ నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సచివాలయం వద్ద విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన 80 మంది లబ్ధిదారులను ఒక్కొక్కరిని పిలిచి విచారణ చేపట్టి వారు అందించిన వివరాలను రికార్డు చేశారు. గ్రామ వలంటీర్లు వేలిముద్రలు వేయించుకుని పింఛన్‌లో సగం నగదు మాత్రమే ఇచ్చారని, మిగతాది చందాకు కేటాయించామని చెప్పారని విచారణ అధికారులకు లబ్ధిదారులు తెలిపారు. అనంతరం 14 మంది గ్రామ వలంటీర్లను పిలిపించి వారిని కూడా విచారించారు. ఎందుకు సగం నగదు ఇచ్చారు?, ఎవరు తీసుకోమన్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు, డీఆర్‌డీఏ పీడీ సచీదేవికి అందించనున్నట్టు అధికారి నూకరాజు తెలిపారు.

అనకాపల్లి డీఎస్పీగా అప్పలరాజు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ అప్పలరాజు

అనకాపల్లి టౌన్, మార్చి 5: అనకాపల్లి డీఎస్పీగా ఎస్.అప్పలరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ నగర పరిధిలో నిఘా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆయన అనకాపల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డీఎస్పీ పనిచేసిన వి.సుబ్బారాజు విజయవాడ ఏసీబీకి బదిలీ అయ్యారు. నూతన డీఎస్పీ అప్పలరాజుకు ఆయన బాధ్యతలు అప్పగించారు.

నూకాంబికను దర్శించుకున్న సుద్దాల అశోక్‌తేజ



అమ్మవారిని దర్శించుకున్న సుద్దాల

అనకాపల్లి టౌన్, మార్చి 5: స్థానిక నూకాంబిక బాలాలయంలో అమ్మవారిని మంగళవారం ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ దర్శించుకున్నారు. తొలుత ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాలాలయంలో అమ్మవారికి అశోక్‌తేజతోపాటు రిటైర్డ్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో వీరిని అర్చకులు ఆశీర్వదించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కాగా నూకాంబిక అమ్మవారిపై ఒక పాటను రూపొందించాలని ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు.. సుద్దాల అశోకతేజను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో అమ్మవారి చరిత్ర కాపీని అందజేశారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పరవాడ, మార్చి 5: మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (బాలురు, బాలికలు) 2024-25 సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తానాం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూ గురుకుల పాఠశాలలు/ కళాశాలల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షలకు 12,088 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 5: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 12,382 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 12,088 మంది హాజరయ్యారని, 294 మంది హాజరుకాలేదని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. జనరల్ విద్యార్థులు 10,087 మందికి 9,868 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,295 మందికి 2,220 మంది హాజరైనట్టు పేర్కొన్నారు.

సంతల ఆశీలు వేలంలో పాటదారులు రింగ్?

▸ గతంకన్నా 00.28 శాతం మాత్రమే అధికం

▸ ఈ ఏడాది రూ.20.98 లక్షలు, గత ఏడాది రూ.20.93 లక్షలు!

▸ అధికారులు నిబంధనలు పాటించలేదని కౌన్సిలర్ నిలదీత



వేలంపాటలో అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ మరిణేశ్వరావు

ఎలమంచిలి, మార్చి 5: మునిసిపాలిటీకి చెందిన వారపు సంత, పశువుల సంతలో ఆశీలు వసూలుకు మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పాటదారులు రింగ్ అయ్యారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే కేవలం పావు శాతం (00.28) మాత్రమే ఆదాయం పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వారపు సంత, పశువుల సంతలో ఆశీలు వసూలు కోసం మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ కొండలరావు, ఆర్వో నీలిమ వేలంపాట నిర్వహించారు. నలుగురు వ్యక్తులు మాత్రమే ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. రామారాయుడుపాలెం 24వ వార్డు కౌన్సిలర్ మరిణేశ్వరావు హాజరై, వేలం పాట నిర్వహిస్తున్నట్టు పట్టణంలో విస్తృతంగా ప్రచారం ఎందుకు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. గతంలో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించి, నోటీసు బోర్డులో సమాచారం వుంచేవారని, ఈ నిబంధనలను ఇప్పుడు ఎందుకు పాటించలేదని నిలదీశారు. రానున్న కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని లేవనెత్తుతానని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పత్రికలో ప్రకటన ఇచ్చి వేలం నిర్వహిస్తున్నామని ఆర్వో బదులిచ్చారు. గత ఏడాది 20 లక్షల 93 వేల రూపాయలకు వేలం పాట జరగ్గా, ఈ ఏడాది కేవలం 20 లక్షల 98 వేల రూపాయలకు నగిరెడ్డి కాసులు నాగేశ్వరావు సంత ఆశీలు వసూలు వేలం పాటను దక్కించుకున్నట్టు ఆర్వో నీలిమ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 5,900 రూపాయలు మాత్రమే పెరగడం.. వేలం పాటలో పాల్గొన్న వ్యక్తులు ముందుగానే ఒక అంగీకారానికి వచ్చినట్టు స్పష్టం అవుతున్నది.

ఐబీ బృందం తేగాడ మోడల్ స్కూల్ సందర్శన

కశింకోట, మార్చి 5 : మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌ను ఇంటర్నేషనల్ బాక్ లారియేట్ (ఐబీ) బృందం మంగళవారం సందర్శించింది. ఐబీ బృందం ఉపాధ్యాయులతో బోధనా విధానాలు, ఉపాధ్యాయ శిక్షణ, బోధనలో అనుభవాలు తదితర అంశాలపై చర్చించారు. ఆచార్య కేశిరాజు శ్రీనివాస్ రాష్ట్ర విద్యా విధానంలో ఐబీ విద్యా విధానం ప్రవేశంపై కలగబోయే ప్రయోజనాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐబీ సీనియర్ కరిక్యులమ్ డిజైన్ మేనేజర్ మిస్టర్ ఆల్బో, ఐబీ అసోసియేట్ మేనేజర్ మిస్టర్ మైకేల్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ప్రిన్సిపాల్ ఐ.మార్తాతిలకం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం నోట అదే పాట

... 3వ పేజీ తరువాయి

విశాఖ వచ్చేస్తున్నారు. మీడియా వారు రాసుకోండి' అంటూ ప్రకటించారు.

● ప్రస్తుతం ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి అనేక సందర్భాల్లో సీఎం జగన్ 2023లో దసరాకు వస్తారని కొన్నిసార్లు, దీపావళి వెళ్లాక వస్తారని ప్రకటించారు. 2024 సంక్రాంతికి వస్తారని ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదిగో వస్తారు...ఇదిగో వస్తారని అంటున్నారు.

విశాఖపట్నం రావడానికి ఈ ప్రచారం దేనికి?..

న్యాయ స్థానాల్లో కేసులు ఉన్నంత వరకూ రాజధాని మార్చడానికి వీల్లేదు. సీఎంగా ఎక్కడి నుంచైనా పరిపాలన చేయవచ్చు. కానీ వందలాది మంది అధికారులు, సిబ్బందిని వెంటేసుకుని వచ్చి, ప్రత్యేక కార్యాలయాలు అంటేనే న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఆ విషయం చెప్పకుండా...అడ్డం పడుతున్నారనే ఆరోపణలు దేనికో మరి. ఇక త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకే సీఎం తాజాగా విశాఖకు వచ్చేస్తాననే మరోమారు ప్రకటన చేసి ఉంటారనే అభిప్రాయం వినిపిస్తోంది.

జయహో బీసీ సభలో జిల్లా నేతలు


గుంటూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు

తుమ్మపాల, మార్చి 5 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులో జరిగిన జయహో బీసీ సభలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పీలా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరంలో కేంద్ర బలగాల కవాతు


సబ్బవరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

సబ్బవరం, మార్చి 5 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు మంగళవారం సబ్బవరంలో కవాతు నిర్వహించాయి. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్ నుంచి చోడవరం రోడ్డులోని లా వర్సిటీ వరకూ కవాతు నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్. ధనుంజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహా శివరాత్రి వేడుకలు

సబ్బవరం, మార్చి 5: సబ్బవరం శివారు గొర్లివానిపాలెం ఉమారామలింగేశ్వర, లక్ష్మీసత్యనారాయణ, కోదండ సీతారామ స్వామి ఆలయంలో బుధవారం నుంచి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు తెలిపారు. పూజా సంకల్పం, తులసి, కుంకుమ, బిల్వపత్ర పూజా మహోత్సవం, 7న లక్ష కుంకుమార్చన, విశేష హోమ కార్యక్రమాలు, 8న అభిషేకాలు, వేద పారాయణం, నవగ్రహ పూజ, విశేష హోమ, మూల మంత్ర హోమాలు, బిల్వార్చన, పుష్పార్చన, సాయంత్రం 7.30 గంటలకు కోదండ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం, 9న పూర్ణాహుతి, అనంతరం అన్నసమారాధన జరుగుతుందని ఆయన చెప్పారు.

కార్మికులకు అండగా కేంద్ర ప్రభుత్వం

తుమ్మపాల, మార్చి 5: కార్మికులకు అండగా కేంద్ర ప్రభుత్వం ముందుకు ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు ఆలమండ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తుమ్మపాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు లబ్ధి చేకూర్చేలా పలు పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తాతారావు, నరసింగ్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం, మార్చి 5: మండలంలోని అడ్డరోడ్డు అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వర్తకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిర్వహించిన సామూహిక కుంకుమ, సింధూర పూజా కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

నక్కపల్లి, మార్చి 5: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జానకయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బాలబాలికలు పలు నృత్య ప్రదర్శనలు, వేషధారణలతో సందడి చేశారు. ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

వేంపాడు హైస్కూల్‌లో యోగా శిక్షణ

నక్కపల్లి, మార్చి 5: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. హెచ్ఎం నర్సింగరావు, పీఈటీ రాంకుమార్, వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ యోగా శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యోగా శిక్షకుడు దవరసింగి రాంబాబు పిల్లలకు ఆసనాలు, ప్రాణాయామంపై శిక్షణ ఇచ్చారు

పీసీసీ అధికార ప్రతినిధిగా గంగాధర్

అనకాపల్లి టౌన్, మార్చి 5 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఐఆర్ గంగాధర్ నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏపీ ఇన్‌చార్జి మాణిక్యంఠాగూర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్‌లు తనను నియమించారన్నారు. గంగాధర్ నియామకం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన టీచర్‌కు సన్మానం

ఎస్. రాయవరం, మార్చి 5: ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ)లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయికు ఎంపికైన ఉప్పరాపల్లి జడ్పీ హైస్కూల్ టీచర్ బొజ్జా అరుణ త్రివేణిను, ఇన్‌చార్జి హెచ్ఎం సంపత్‌లను మంగళవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మండల సమన్వయకర్త సత్యనారాయణ సన్మానించారు. అనంతరం వారి సేవలను అభినందించారు.

బొజ్జన్నకొండ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

తుమ్మపాల, మార్చి 5: బొజ్జన్నకొండ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి పేర్కొన్నారు. మంగళవారం ఆమెను కలిసిన తుమ్మపాల నాయకులతో మాట్లాడారు. ప్రధానంగా తుమ్మపాల మెయిన్‌రోడ్డు నుంచి బొజ్జన్నకొండ వరకు పది లక్షల రూపాయలతో సోలార్ లైట్లు వేస్తున్నామన్నారు. అలాగే వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం నాయకులు ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఉపసర్పంచ్ చదరం చిన్న, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలని లోకేశ్‌కు వినతి

అనకాపల్లి టౌన్, మార్చి 5: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులను అన్నివిధాలా ఆదుకోవాలని టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కశిరెడ్డి అర్జున టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగులకు న్యాయం జరగలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల సమస్యలను చేర్చాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్‌ను ఆరు వేలకు పెంచాలని, సదరం, ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబంలో ఇద్దరికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యం

» సినీ గేయ రచయిత అశోకతేజ



అనకాపల్లి టౌన్, మార్చి 5 : మానవ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో తన వంతుగా పాట యాత్ర ప్రారంభించానని సినీ గేయ రచయిత సుద్దాల అశోకతేజ చెప్పారు. మంగళవారం ఆయన అనకాపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం విశాఖలో తన పాట యాత్రకు శ్రీకారం చుట్టానన్నారు. సోమవారం భీమిలిలో నిర్వహించామన్నారు. ఈ నెల 21వ తేదీన సూర్యాపేటలో చేస్తానన్నారు. సమాజంలో మానవ సంబంధాలు పెంపొందించడానికి కార్యక్రమాలు చేయాలనే ఆలోచనలో ఉన్నానన్నారు. ఇప్పటికే 40 కార్యక్రమాలు ఖరారయ్యాయన్నారు. నా వంతు ప్రయత్నంగా అనాథ ఆశ్రమాలు, స్వచ్ఛంద సంస్థలకు వెళ్లి నా జీవితంలో జరిగిన అనుభవాలు పాటలతో ఉదహరిస్తూ చెబుతానన్నారు. దీనివల్ల కొంతమంది మారినా తన యాత్ర ఫలించినట్లేనన్నారు. తెలుగు మృతి భాష అనడం సరికాదన్నారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు తెలుగుభాష ఉంటుందన్నారు. న్యాయస్థానాల్లో తీర్పులు తెలుగులో రావాలన్నారు. చిన్నతనం లోనే పిల్లలకు పరిజ్ఞానం పెంచాలని, తెలుగు కనిపించాలి, వినిపించాలి, అనిపించాలని పేర్కొన్నారు. కొత్తపదాలు తెలుగులోకి రావాల్సి ఉందన్నారు. ఇటీవల కాలంలో మానవ సంబంధాలు బాగా తగ్గిపోతున్నాయని, వీటిని పెంపొందించడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు విప్లవం, మానవ సంబంధాలకు ఎక్కువ పాటలు రాశానని, సినీనటుడు మోహనబాబు తీస్తున్న భక్తకన్నప్ప సినిమాకి శివతత్వంపై తొమ్మిది పాటలు రాశానన్నారు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తనకిష్టమైన పాట పాండురంగడు చిత్రంలోని మాతృదేవోభవ అనే పల్లవితో ప్రారంభించిన పాట అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పుస్తక లోకం.. విజ్ఞాన విహారం

దారి తప్పిన యువతను పుస్తకాలతో మార్పు తీసుకురావచ్చునని సినీ గేయ రచయిత, సాహితీవేత్త సుద్దాల అశోకతేజ అన్నారు. మంగళవారం ఈయన స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీసా, పాస్‌పోర్టు లేకుండా గ్రంథాలయాలు, పుస్తకాలతో విశ్వవిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. గతంలోకి, భవిష్యత్తులోకి తీసుకువెళ్లేది పుస్తకమేనన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు గౌరీ గ్రంథాలయం వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు ప్రాధాన్యం : ప్రగడ


జయహో బీసీ గర్జనకు వాహనాలను జెండా ఊపుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, మార్చి 5 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా చంద్రబాబు నిలుస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రం నుంచి మంగళగిరి బీసీ గర్జనకు వెళుతున్న వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ బీసీ గర్జనలో డిక్లరేషన్ ప్రకటించనున్నారన్నారు. ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 30 కార్లతోపాటు మినీ బస్సుల్లో నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, టీడీపీ నేతలు గొర్లె నానాజీ, మేరుగు బాపునాయుడు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, రాజాన వెంకునాయుడు, ప్రసాద్ తదితరులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

కోటవురట్ల, మార్చి5: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఎస్ఐ రమణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం చౌడువాడ, పాతగొట్టివాడ గ్రామాల్లో పర్యటించి, ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికలకు విఘాతం కలిగించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు, మద్యం పంపిణీ చేసినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు


మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కశింకోట, మార్చి 5 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. మంగళవారం స్థానిక సత్తెమ్మ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా నాయకురాలు డీ.డీ.వరలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలందరూ మహిళా సాధికారతను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా సంఘ సభ్యులు తనుజ, నారాయణమ్మ, విజయ, వనిత, భాగ్యశ్రీ, మాధురి, మంజు, వీరలక్ష్మి, శ్యామల, నూకరత్నం, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల పరిరక్షణ అందరి బాధ్యత : ఎంపీపీ

సబ్బవరం, మార్చి 5 : సమాజంలో ఆడ బిడ్డలను పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సీడీపీవో లలితకుమారి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. లింగ వివక్షత లేని రాష్ట్రంగా ఏపీ ఆవతరించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ సీడ్ ఆర్గనైజర్ రాజు మాట్లాడుతూ.. బాల్య వివాహ నిరోధ చట్టం-2016 గురించి, ఆడపిల్లల రక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలు గురించి వివరించారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి సీఐ పిన్నింటి రమణ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, తహసీల్దార్ జె చలమయ్య, ఎంఈవో లక్ష్మణరావు, ఏవో షేక్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి వితరణ

ఎలమంచిలి, మార్చి 5: మండలంలోని పురుషోత్తపురం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పరీక్షల సామగ్రిని వితరణగా అందజేశారు. మంగళవారం విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేశారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు వెళ్లే విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు ఫీజులు చెల్లించేందుకు ముందుకు వచ్చారని హెచ్ఎం, శోభారాణి తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం. ఆనంద్, కార్యదర్శి ఎం.జయప్రకాష్‌లను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వృద్ధులకు రాయితీ కల్పించాలి

అనకాపల్లి టౌన్, మార్చి 5 : వృద్ధులకు ప్రభుత్వం రాయితీలు కల్పించాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. మంగళవారం స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతిలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైళ్లు, బస్సులు, యాత్ర స్థలాల్లోను ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా ఆసుపత్రుల్లో వృద్ధులకు చెందాల్సిన రాయితీల్లో అన్యాయం జరగడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వృద్ధులకు అన్ని రంగాల్లో కల్పించాల్సిన రాయితీలు అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో విల్లూరి రాము, శరగడం నూకరాజు, బుద్ద తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండుగ

అచ్యుతాపురం రూరల్, మార్చి 23: మండలంలోని మడుతూరులో నూకాలమ్మ పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, పల్లి శేషగిరిరావు, వెంకునాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం సభకు మహిళలు తరలింపుపై అధికారుల ప్రయాస


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అచ్యుతాపురం రూరల్, మార్చి 23 : అనకాపల్లిలో ఈనెల 7న జరిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభకు భారీ ఎత్తున మహిళలను తరలించాలని అధికారులు పడుతున్న ప్రయాస పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీడీఓ సురేష్‌కుమార్, వెలుగు ఏపీఎం చినతల్లి తమ సిబ్బందికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామం నుంచి మహిళలను తీసుకు రావాలని ఆదేశించారు. బస్సులలో మంచినీరు, అల్పాహారాన్ని సిబ్బందే అందించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల జీఓలను వెంటనే అమలు చేయాలి

ఎలమంచిలి, మార్చి 5: మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంపు జీఓలను వెంటనే అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్(ఏఐటీయూసీ)జిల్లా ప్రధాన కార్యదర్శి గనిసెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. మంగళవారం మునిసిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ నంబరు 36 ప్రకారం మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు, డ్రైవర్స్, స్కిల్ వర్కర్స్‌ను పరిగణనలోకి తీసుకుని జీఓ వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం కమిషనర్ కొండలరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వై.నూకరాజు, వెంకటరమణ, డి.మహేష్, జె.వెంకటరమణ, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ లెవల్ ఏజెంట్లు కీలకం : జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర నాయకుడు శివశంకర్

అచ్యుతాపురం రూరల్, మార్చి 23 : రానున్న శాసనసభ ఎన్నికల్లో బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని శివశంకర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జనసేన కార్యకర్తలు, నాయకులతో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూతులలో అధికార పార్టీ నాయకులు ఓటర్లను, ఓట్లను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. ఓటర్ల లిస్టులో ఉన్న అందరినీ తెలిసిన వారినే బూత్ ఏజెంట్లుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు తోట సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

... 3వ పేజీ తరువాయి

భవనానికి కేటాయించన స్థలంపై కొంతమంది స్థానిక పెద్దల కళ్లు పడ్డాయి. సుమారు 30 సెంట్లు కబ్జా చేశారు. ఈ స్థలం పక్కనే ప్రైవేటు లే-అవుట్, అప్పటికే కబ్జాకు గురైన సర్వే నంబరు 264లో ప్రభుత్వ భూమి ఉండడంతో కబ్జాదారులకు కలసి వచ్చింది. ఆక్రమించిన స్థలంలో భవనాలు నిర్మిస్తున్నారు. ఇక్కడ సెంటు రూ.5 లక్షలు పలుకుతున్నది. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం విలువ రూ.1.5 కోట్లు చేస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బీసీ సంక్షేమ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


ఆక్రమిత స్థలంలో చేపట్టిన ఇంటి నిర్మాణం

కేంద్రం నిధులు దారి మళ్లింపు

... 3వ పేజీ తరువాయి

చేసిన పనులకు సుమారు రూ.20 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కోసం కేంద్రం నిధులు మంజూరుచేస్తుంది. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులను కొందరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల నుంచి అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, విస్తరణ పనులు చేయిస్తోంది. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించేసింది. బిల్లులు విడుదల కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా నిలిపివేశారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

... 3వ పేజీ తరువాయి

వున్నాయంటూ ప్రజలను మభ్యపెట్టి స్థలాలను అమ్ముతున్నారు. కొనుగోలుదారులు ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు.. లేఅవుట్‌కు అనుమతులు లేవని తెలుసుకుని కంగుతింటున్నారు. అనకాపల్లి మండలం కూండ్రం, కుంచంగి, కొప్పాక, సిరసపల్లి, మారేడుపూడి, పిసినికాడ, రేబాక, శంకరం పరిసరాల్లో అనుమతులు లేకుండా వేసిన ప్రైవేటు లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన పలువురు ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎల్‌పీసీల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాల్సి వస్తే రెవెన్యూ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. భూమి మార్పిడి (నాలా) అనుమతుల కోసం స్థానిక గ్రామ పంచాయతీకి కొంత రుసుము చెల్లించాలి. తరువాత వీఎంఆర్‌డీఏ పరిధిలో వుంటే ఆ అథారిటీ నుంచి కూడా అనుమతి పొందాలి. వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు పొందిన తరువాత విద్యుత్, రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించి, ప్లాట్లుగా విభజించి విక్రయించాలి. కానీ జిల్లాలో ఎక్కువ మంది రియల్టర్లు ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే వ్యవసాయ భూములను లేఅవుట్లుగా మార్చేసి, ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకొంటున్నారు.

అంతేకాకుండా లేఅవుట్‌లో సామాజిక అవసరాలకు 10 శాతం స్థలాన్ని విడిచిపెట్టడంలేదు. స్థానిక పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు అనధికార లేఅవుట్‌లపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, స్థానిక ప్రజాప్రతినిధులు అండగా వుండడంతో ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

... 3వ పేజీ తరువాయి

ప్రస్తుతం తాగునీటి సమస్య లేదని తెలిపారు.

తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ అజెండాలోని 11, 12 అంశాలలో పేర్కొన్న ఎంపీ నిధులతో చేపడుతున్న రోడ్డు పనులు నామినేషన్ విధానంలో ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ నిధులు ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని అన్నారు. నాణ్యత లేని రోడ్లు వేసి ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, నర్సీపట్నంలో 40 సంవత్సరాల్లో జరగని అభివృద్ధినిఇ ప్రస్తుత ఎమ్మెల్యే నాలుగేళ్లలో చేసి చూపించారని అన్నారు. టీడీపీ కౌన్సిలర్ మధు స్పందిస్తూ.. టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను మాఫీ చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తామన్న హామీని అమలు చేశారా? అని ప్రశ్నించారు. దీంతో వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ మధుల మధ్య వాగ్వాదం జరిగింది. వీరికి మద్దతుగా ఆయా పార్టీల కౌన్సిలర్లు చింతకాయల రాజేశ్, రాజునాయుడు బయపురెడ్డి చిన్నబాబు, మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని నిలిచి, చైర్‌పర్సన్ పోడియం ముందు వాగ్వాదానికి దిగారు. పరస్పరం తోసుకున్నారు. ఈ సమయంలో 27వవార్డు టీడీపీ కౌన్సిలర్ పైల కాశీరత్నం భర్త గోవింద్ సమావేశ మందిరంలోకి రావడంతో వైసీపీ కౌన్సిలర్ సిరసపల్లి నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుడు కాని వ్యక్తి కౌన్సిల్ సమావేశంలోకి ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట మరింత పెరగడంతో మూడో వార్డు కౌన్సిలర్ చెక్క బాలమ్మ, కోఆప్షన్ సభ్యురాలు రోజా వచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం 9వవార్డు కౌన్సిలర్ (జనసేన) అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను ధ్వంసం చేయడంతో వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను ప్రదర్శించారు. ప్రైవేటు కార్యక్రమాలకుఅద్దెకు ఇవ్వడం వల్ల స్టేడియంను పాడవుతున్నదని అన్నారు. టిడ్కో లబ్ధిదారులు చెల్లించిన డిపాజిట్లను ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ వారికి డబ్బులు తిరిగి చెల్లించలేదని, వెంటనే ఇప్పించాలని కోరుతూ చింతకాయల పద్మావతి, రాజేశ్‌లు చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి


స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట, మార్చి 5 : మండలంలోని పిసినికాడలో ఈ నెల 7న జరగనున్న ముఖ్యమంత్రి సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో హెలీపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

» విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్షి

పరవాడ, మార్చి 5: ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరిగా ఉండాలని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్షి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో మంగళవారం ఫార్మా పరిశ్రమల మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భక్షి మాట్లాడుతూ క్యాన్సర్ రోజురోజుకు విస్తరిస్తున్న తరుణంలో అందరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం ఎంతో ఉపయోగకరమన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా వ్యాధి నుంచి బయటపడొచ్చునన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, రాంకీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరవాడ, మార్చి 5 : ఫార్మా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ ర్యాలీ విజయశ్రీ ఫార్మా నుంచి ఐటీసీ బాటిలింగ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, జి.చిట్టిబాబు, ఎస్.అప్పలనాయుడు, ఎం.కొండబాబు పాల్గొన్నారు.

డైట్‌కు పరిశోధనా కేంద్రాల హోదాను పొడిగింపు


లేఖ అందుకుంటున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 5 : జీవీ పరిశోధన కేంద్రాల హోదాను స్థానిక డైట్ కళాశాలకు జేఎన్‌టీయూ విజయనగరం మూడేళ్లు పొడిగించింది. ఇందుకు సంబంధించిన లేఖను జేఎన్‌టీయూ అధికారుల నుంచి డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులను సమాజ పురోగతికి సహాయపడే పరిశోధన, అభివృద్ధి వైపు ప్రేరేపించడం ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధిని ఎల్లప్పుడూ ఆలోచిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు డాక్టర్ పూర్ణప్రియ, డాక్టర్ ఎ.నళినికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరంలో 77 మందికి పరీక్షలు

కొత్తూరు, మార్చి 5: అనకాపల్లి మండలం కూండ్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 77 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 25మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని వైద్యులు నిర్ధారించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందారపు లక్ష్మి, టీడీపీ నాయకులు నందారపు సూరిబాబు, ఆప్తలమిక్ అధికారి హరిచందన, కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్వనికుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం

అనకాపల్లి టౌన్, మార్చి 5 : విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ఎస్ఎఫ్ఐ చేస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి నమూనా పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించి మంగళవారం స్థానిక జీవీఎంసీ పట్టణ బాలిక ఉన్నత పాఠశాలలో బహుమతి ప్రధానోత్సవం జరిగింది. నమూనా పరీక్షలో ఎ.అమృతవర్షిణికి ప్రథమ, పి.దుర్గాప్రసాద్‌కి ద్వితీయ, ధన్యశ్రీకి తృతీయ బహుమతులను ఎంఈవో కె.చిట్టిబాబు, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ అందజేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ, జి.తరుణ్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

అనకాపల్లి టౌన్, మార్చి 5 : గోపాలపట్నంలో ఈనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు జరిగిన మూడో ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనకాపల్లికి చెందిన ఫిట్‌నెస్ బాక్సింగ్ కోచింగ్ సెంటర్ క్రీడాకారులు ప్రతిభకనబరిచారు. ఈ పోటీల్లో ఇ.లక్షిత్ 37 నుంచి 40 కిలోల కేటగిరిలో రాష్ట్రస్థాయిలో సిల్వర్‌మెడల్ సాధించగా.. 58 నుంచి 60కిలోల కేటగిరిలో ఏ.విశాల్ బెస్ట్ ప్రొమోటింగ్ బాక్సర్ అవార్డును అందుకున్నారని శిక్షకులు హరీష్, అరుణ తెలిపారు.

పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

అనకాపల్లి టౌన్, మార్చి 5 : స్థానిక ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మంది పేదలకు ఉచితంగా ఐఓఎల్ కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సోమవారం కంటి పరీక్షలకు 25 మంది ఆస్పత్రికి రాగా వీరికి నేత్ర వైద్య సహాయకురాలు దేవి పరీక్షలు నిర్వహించి, ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని గుర్తించినట్టు ఆసుపత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. వీరికి మంగళవారం ఆస్పత్రిలో డాక్టర్ కె. మల్లేశ్వరరావు ఐఓఎల్ ఆపరేషన్ చేశారన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

భక్తి శ్రద్ధలతో శూలాల మహోత్సవం


ధర్మవరంలో శూలాల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎలమంచిలి, మార్చి 5: స్థానిక ధర్మవరంలో బావనారుషి కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన శూలాల మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. భక్తులు సంప్రదాయ రీతిలో శూలాలను గుచ్చుకుని భక్తి భావాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండల కేంద్రంలో శూలాల మహోత్సవం సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ ఘనంగా జరిగింది. నక్కపల్లి చేనేత సంక్షేమ, పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి భావనారుషి శూలల పండుగను నిర్వహించారు. పత్రిపూజ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన అనేకమంది భక్తులు తమ నాలుకలపై శూలాలు గుచ్చుకుని భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

సారా బట్టీలపై పోలీసుల దాడులు

నాతవరం, మార్చి 5 : మండలంలోని గుమ్మిడిగొండ శివారు ఏటిగట్టు ఒడ్డున సారా బట్టీలపై మంగళవారం దాడులు నిర్వహించినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఈ దాడులలో సారా తయారీకి ఉపయోగించే 4,500 లీటర్ల బెల్లం పులుసు, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని సీజ్ చేశామన్నారు. అలాగే నాటుసారా తయారు చేస్తున్న జి.నాని అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

వేములపూడి సంత వేలం పాట వాయిదా

నర్సీపట్నం అర్బన్, మార్చి 5 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన వేములపూడి సంత వేలంపాటను వాయిదా వేసినట్టు ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన వేలం పాటలో ప్రభుత్వం సూచించిన బిడ్స్ మేరకు పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాటను ఈనెల 11వ తేదీకి వాయిదా వేశామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వేలం పాట రూ.6.2 లక్షలు కాగా.. ఆ మొత్తాన్ని పాడుకునేందుకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.

టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి

నర్సీపట్నం, మార్చి 5 : టిడ్కో గృహాల వద్ద తాగునీరు, విద్యుత్, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా లబ్ధిదారులకు అప్పగించారని సీపీఎం నాయకులు అడిగర్ల రాజు తెలిపారు. మంగళవారం కసిమి రోడ్డులోని టిడ్కో గృహాలను ఆయన పరిశీలించారు. పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే టిడ్కో గృహాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చోద్యం హైస్కూల్ విద్యార్థుల ఫేర్‌వెల్

కృష్ణాదేవిపేట, మార్చి 5: గొలుగొండ మండలం చోద్యం హైస్కూల్‌లో మంగళవారం ఫేర్‌వెల్ కార్యక్రమం విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో హెచ్‌ఎం రత్నాజీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజు, లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి ప్రజలు సహకరించండి

కృష్ణాదేవిపేట, మార్చి 5 : ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా పోలీసులకు సహకరించాలని కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం. ఉపేంద్ర కోరారు. మంగళవారం రాత్రి సీహెచ్ నాగాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గొడవలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామ్, మాజీసర్పంచ్ కొలగాని రామారావు, వైసీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సరుగుడులో సిమెంట్ బస్తాలు ఏమయ్యాయి?

» అధికారులను ప్రశ్నించిన ఎంపీపీ లక్ష్మణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం, మార్చి 5: సరుగుడులో సచివాలయ నిర్మాణానికి వచ్చిన రెండు వేల సిమెంట్ బస్తాలు ఏమయ్యాయని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులను నిలదీశారు. మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాయమైన సిమెంట్ బస్తాలు అధికారుల వన్నాయా? నాయకుల వద్ద ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. సిమెంట్ మాయం కావడం వల్ల సచివాలయ నిర్మాణం జరగడం లేదన్నారు. వెంటనే సచివాలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. సిమెంట్ మాయమైన సమయంలో తాను లేనని, ఆ విషయం తనకు తెలియదని తేల్చి చెప్పారు. అనంతరం సరుగు సర్పంచ్ గంగరాజు మాట్లాడుతూ.. సరుగుడు గిరిజన గ్రామంలో శిశు మరణాలు జరుగుతున్న నాతవరం పీహెచ్‌సీ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. డి. యర్రవరం సర్పంచ్ ఇనపసప్పల సత్యవతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు అయినా డబ్బులు పడలేదన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వ్యవసాధికారి శైలజ మాట్లాడుతూ మండలంలో మిచౌంగ్ తుఫాన్ వలన 880 ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లిందని, 985 మంది రైతులకు ఎకరాకు 6,800 రూపాయలు నష్ట పరిహారం ఇవ్వనున్నట్టు చెప్పారు. రెండు రోజులలో రైతుల అక్కౌంట్‌లలో వేస్తారన్నారు. కొసూరు బుజ్జి మాట్లాడుతూ జల్‌జీవన్‌మిషన్ పనుల వలన సిమెంట్ రోడ్లు దెబ్బతింటున్నాయని, దీనికి కాంట్రాక్టరు బాధ్యత వహిస్తారా? పంచాయతీవారు బాధ్యత వహిస్తారో చెప్పాలన్నారు.

అనంతరం మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ మాట్లాడుతూ తాను మండల కోఆప్షన్ సభ్యుని పదవికి రాజీనామా చేస్తున్నానని ఎంపీడీవో రాంబాబుకు రాజీనామా లేఖను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, మండల వైస్ ఎంపీపీ-2 షైనం నాగ గోపీ,ఎంఈఓ అమృతకుమార్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్ నరసింగరావు, కరక అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్మారక చిహ్నాలను అభివృద్ధి చేయాలి

నర్సీపట్నం, మార్చి 5 : బ్రిటీష్ వారిపై అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటానికి గుర్తుగా ఉన్న నర్సీపట్నంలోని కవర్టు. ఫైటర్ల సమాధుల స్థలాన్ని స్మారక చిహ్నంగా అభివృద్ధి చేయాలని అల్లూరి యువజన సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బ్రిటీష్ మిలటరీ అధికారుల సమాధుల స్థలాన్ని సంఘ సభ్యులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ అధికారుల సమాధుల స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటనందురు అల్లూరి సీతారామరాజు సేవా సంఘం అధ్యక్షుడు లక్కాకుల బాబీ, సామాజిక కార్యకర్త కె. శివనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


బ్రిటిష్ అధికారుల సమాధుల వద్ద అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు

తామరం జగనన్న కాలనీలో ఆక్రమణలు

» ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

» కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంతు రమణ ఆరోపణ

మాకవరపాలెం, మార్చి 5: మండలంలో తామరంలో ఉన్న జగనన్న కాలనీల్లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోడం లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బొంతు రమణ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న కాలనీలో మిగులు భూమిని అర్హులకు స్థలాలు ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదన్నారు. ఈ కాలనీలో మిగులు ఉన్న 40 సెంట్లు స్థలాన్ని కొందరు చదును చేసి సిమెంట్ పోల్స్ వేసి ఆక్రమిస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా ప్రస్తుత రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆ స్థలాన్ని అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, లేకుంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పలు గ్రామాల్లో తలుపులమ్మ, గంగాదేవిల పండగలు

గొలుగొండ, ఫిబ్రవరి 5: మండలంలోని పలు గ్రామాల్లో తలుపులమ్మ, గంగాదేవిల పండగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నర్సింగబిల్లి, రాజుపేట గ్రామాల్లో తలుపులమ్మ పండగ, సాలికమల్లవరంలో గంగాదేవి పండగను నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు పెదిరెడ్ల మల్లేశ్వరరావు, కొల్లాన కొండలరావు, అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

గునుపూడిలో పరదేశమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం, మార్చి 5 : మండలంలోని గునుపూడి లో ప్రతి రెండేళ్లకొకసారి నిర్వహించే పరదేశమ్మ జాతర రెండు రోజుల నుంచి అంగరంగవైభవంగా జరుగుతున్నది. మంగళవారం పరదేశమ్మ అమ్మ వారి పండగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు.అలాగే జాతరలో శక్తివేషాలు, శివపార్వతుల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎస్‌ఐ రామారావు ఉత్సవాలలో ఎలాంటి గొడవలు జరగకుండా సిబ్బందితో పర్యవేక్షించారు ఉత్సవకమిటీ సభ్యులు సర్పంచ్ వేముల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పోలుపర్తి వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రికి ఏఎల్‌పురం నీలకంఠేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

కృష్ణాదేవిపేట, మార్చి 5: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు తపస్సు చేసిన ఏఎల్‌పురం స్వయంభూ నీలకంఠేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అవుతున్నది. ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన వందలాది భక్తులు బొడ్డేరు గెడ్డ ఉత్తరవాహినిలో స్నానాలు చేసిన నీలకంఠేశ్వరస్వామివారికి పూజలు జరపడం ఆనవాయితీ. ఆలయానికి విద్యుత్ అలంకరణ చేసి, చలువ పందిరిని వేశారు. శుక్రవారం నుంచి మూడు రోజులు పాటు జరగనున్న ఉత్సవాల్లో అన్నసమారాధనతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కేంద్రం నిధులు దారి మళ్లింపు

... 3వ పేజీ తరువాయి

చేసిన పనులకు సుమారు రూ.20 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కోసం కేంద్రం నిధులు మంజూరుచేస్తుంది. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులను కొందరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉన్నట్టు చెబుతున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల నుంచి అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, విస్తరణ పనులు చేయిస్తోంది. ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.400 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించేసింది. బిల్లులు విడుదల కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా నిలిపివేశారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

... 3వ పేజీ తరువాయి


ఎన్టీఆర్ మినీ స్టేడియం సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తున్న జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య

ప్రస్తుతం తాగు నీటి సమస్య లేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ అజెండాలోని 11, 12 అంశాలలో పేర్కొన్న ఎంపీ నిధులతో చేపడుతున్న రోడ్డు పనులు నామినేషన్ విధానంలో ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ నిధులు ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని అన్నారు. నాణ్యత లేని రోడ్లు వేసి ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, నర్సీపట్నంలో 40 సంవత్సరాల్లో జరగని అభివృద్ధిని ఇ ప్రస్తుత ఎమ్మెల్యే నాలుగేళ్లలో చేసి చూపించారని అన్నారు. టీడీపీ కౌన్సిలర్ మధు స్పందిస్తూ.. టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను మాఫీ చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తామన్న హామీని అమలు చేశారా? అని ప్రశ్నించారు. దీంతో వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ మధుల మధ్య వాగ్వాదం జరిగింది. వీరికి మద్దతుగా ఆయా పార్టీల కౌన్సిలర్లు చింతకాయల రాజేశ్, రాజునాయుడు బయపురెడ్డి చిన్నబాబు, మాకిరెడ్డి బుల్లిదొర, సిరసపల్లి నాని నిలిచి, చైర్‌పర్సన్ పోడియం ముందు వాగ్వాదానికి దిగారు. పరస్పరం తోసుకున్నారు. ఈ సమయంలో 27వవార్డు టీడీపీ కౌన్సిలర్ పైల కాశీరత్నం భర్త గోవింద్ సమావేశ మందిరంలోకి రావడంతో వైసీపీ కౌన్సిలర్ సిరసపల్లి నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుడు కాని వ్యక్తి కౌన్సిల్ సమావేశంలోకి ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట మరింత పెరగడంతో మూడో వార్డు కౌన్సిలర్ చెక్క బాలమ్మ, కోఆప్షన్ సభ్యురాలు రోజా వచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం 9వవార్డు కౌన్సిలర్ (జనసేన) అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను ధ్వంసం చేయడంతో వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను ప్రదర్శించారు. ప్రైవేటు కార్యక్రమాలకుఅద్దెకు ఇవ్వడం వల్ల స్టేడియంను పాడవుతున్నదన్నారు. టిడ్కో లబ్ధిదారులు చెల్లించిన డిపాజిట్లను ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ వారికి డబ్బులు తిరిగి చెల్లించలేదని, వెంటనే ఇప్పించాలని కోరుతూ చింతకాయల పద్మావతి, రాజేశ్‌లు చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

చోడవరం
నియోజకవర్గం

చినపాచిలలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

రావికమతం, మార్చి 5: మండలంలోని చినపాచిల అభయాంజనేయ స్వామి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ 50 మంది భక్తులు మాలధారణ చేశారు. ఆలయ అర్చకులు వెంకటరామ గోపాలాచార్యులు, పవన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం లక్ష సింధూర అర్చన, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. మాలధారణ భక్తులు గ్రామంలో రామనామంతో ఊరేగింపు నిర్వహించారు.

11న మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట, మార్చి 5: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదిన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటాచార్యులు తెలిపారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

బుచ్చెయ్యపేట, మార్చి 5: వడ్డాది సబ్ డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్టు ఏడీఈ ఎన్.అప్పలనాయుడు తెలిపారు. బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, రావికమతం మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సుకు హజరుకావాలని కోరారు. విద్యుత్ సంబంధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

రావికమతం, మార్చి 5: మిచౌంగ్ తుపాన్‌కు పంట నష్టపోయిన రైతులకు సీఎం జగన్ బుధవారం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తారని వ్యవసాయాధికారి రూప తెలిపారు. మండలంలో 27 పంచాయతీల పరిధిలోని 905 మంది రైతులకు చెందిన 166.5 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని నివేదిక పంపామన్నారు. వీరికి రూ.28.3 లక్షలను ప్రభుత్వం రాయితీగా విడుదల చేస్తుందన్నారు.

మాజీ మంత్రి బలిరెడ్డి విగ్రహావిష్కరణ

చోడవరం, మార్చి 5: మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు విగ్రహావిష్కరణ బుధవారం నిర్వహిస్తామని అతని కుటుంబీకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బలిరెడ్డి అభిమానులతో పాటు స్థానిక నాయకులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

బుచ్చెయ్యపేట, మార్చి 5: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు కోరారు. మండలంలోని మంగళాపురం గ్రామంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సురక్ష వైద్య పథకం ఒక వరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.పద్మరేఖ, వైద్యులు పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణపై యాదవుల ఆందోళన

చోడవరం, మార్చి 5: మండలంలోని నరసాపురంలో గొర్రెలు మేకల పెంపకందారుల స్థలాలను స్థానిక నాయకులు ఆక్రమించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా యాదవులు మంగళవారం ఆందోళనకు దిగారు. నరసాపురం సమీపంలోని కొండపై గొర్రెలు, మేకల పెంపకందారులు చాలా కాలంగా ఆ స్థలాలను ఉపయోగించుకుంటున్నారని, ఇపుడు స్థానిక నాయకులు ఆక్రమించేందుకు చర్యలు చేపట్టారని, వీటిని ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరాం హెచ్చరించారు. ఈ స్థలాలు యాదవులకు ఉండేలా స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు దేవర అప్పారావు, నంబారు మూలినాయుడు, చొప్పా వెంకట అప్పారావు, బూర అప్పారావు, అన్నపూర్ణ, సానబోయిన గోవింద్ పాల్గొన్నారు.


నరసాపురంలో ఆందోళన చేస్తున్న గొర్రెలు మేకల పెంపకందారులు


దిబ్బిడి గ్రామంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు

బుచ్చెయ్యపేట, మార్చి 5: విద్యతో రాణిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎంఈవో విశ్వేశ్వరరావు చెప్పారు. మండలంలోని దిబ్బిడి ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవం, విజయరామరాజుపేట జడ్పీ హైస్కూల్ ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయన్నారు. ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ దస్తులు ధరించి ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పెదరెడ్ల మాణిక్యం వై.విజయకుమార్, హెచ్‌ఎంలు సత్యారావు, డి.వి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం జడ్పీ హైస్కూల్‌లో...

రావికమతం: మండ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తమతో కలసి మెలసి చదువుకుని పాఠశాలను వీడుతున్న పదో తరగతి విద్యార్థులను ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులు ఆలింగనం చేసుకుని చక్కని ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బీసీలకు గుర్తింపు ఇచ్చిన ఘనత మాదే'

చోడవరం, మార్చి 5: రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు ఇచ్చింది తామేనని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పేర్కొన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల కోసం టీడీపీ నేతలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీసీలకు అత్యధికంగా పదవులు ఇచ్చిన ఖ్యాతి సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. సమావేశంలో బీసీ నాయకులు మారిశెట్టి శ్రీకాంత్, నాగులాపల్లి రాంబాబు, డి.వెంకటరావు, పుల్లేటి వెంకటరావు, భవానీ పాల్గొన్నారు.

దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయండి


గర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దివ్యాంగుల సంఘ నేతలు

దేవరాపల్లి, మార్చి 5: దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఈ నెల 9న చేపడుతున్న చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గర్బిడ్డి రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మైదానంలో చేపట్టే ఈ గర్జనను అధిక సంఖ్యలో దివ్యాంగులు తరలిరావాలని కోరారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని, రోస్టర్ 56ను, బదిలీల రోస్టర్ 31ను పదిలోపు మార్చాలని, వివిధ రకాల డిమాండ్లతో గర్జన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గాడి రాము, కాదల రామకృష్ణ, చంద్రినాయుడు, చెల్లారావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

... 3వ పేజీ తరువాయి


ఆక్రమిత స్థలంలో చేపట్టిన నిర్మాణం

భవనానికి కేటాయించన స్థలంపై కొంతమంది స్థానిక పెద్దల కళ్లు పడ్డాయి. సుమారు 30 సెంట్లు కబ్జా చేశారు. ఈ స్థలం పక్కనే ప్రైవేటు లే-అవుట్, అప్పటికే కబ్జాకు గురైన సర్వే నంబరు 264లో ప్రభుత్వ భూమి ఉండడంతో కబ్జాదారులకు కలసి వచ్చింది. ఆక్రమించిన స్థలంలో భవనాలు నిర్మిస్తున్నారు. ఇక్కడ సెంటు రూ.5 లక్షలు పలుకుతున్నది. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం విలువ రూ.1.5 కోట్లు చేస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బీసీ సంక్షేమ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు

... 3వ పేజీ తరువాయి

వున్నాయంటూ ప్రజలను మభ్యపెట్టి స్థలాలను అమ్ముతున్నారు. కొనుగోలుదారులు ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు.. లేఅవుట్‌కు అనుమతులు లేవని తెలుసుకుని కంగుతింటున్నారు. అనకాపల్లి మండలం కూండ్రం, కుంచంగి, కొప్పాక, సిరసపల్లి, మారేడుపూడి, పిసినికాడ, రేబాక, శంకరం పరిసరాల్లో అనుమతులు లేకుండా వేసిన ప్రైవేటు లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసిన పలువురు ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎల్‌పీసీల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాల్సి వస్తే రెవెన్యూ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. భూమి మార్పిడి (నాలా) అనుమతుల కోసం స్థానిక గ్రామ పంచాయతీకి కొంత రుసుము చెల్లించాలి. తరువాత వీఎంఆర్‌డీఏ పరిధిలో వుంటే ఆ అథారిటీ నుంచి కూడా అనుమతి పొందాలి. వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు పొందిన తరువాత విద్యుత్, రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించి, ప్లాట్‌లుగా విభజించి విక్రయించాలి. కానీ జిల్లాలో ఎక్కువ మంది రియల్టర్లు ప్రభుత్వ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే వ్యవసాయ భూములను లేఅవుట్లుగా మార్చేసి, ప్లాట్లు వేసి దర్జాగా అమ్ముకొంటున్నారు. అంతేకా లేఅవుట్‌లో సామాజిక అవసరాలకు 10 శాతం స్థలాన్ని విడిచిపెట్టడంలేదు. స్థానిక పంచాయతీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులు అనధికార లేఅవుట్‌లపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, స్థానిక ప్రజాప్రతినిధులు అండగా వుండడంతో ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మాడుగుల
నియోజకవర్గం

రూ.65 లక్షలతో మూడు రహదారుల మరమ్మతులు: డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ, మార్చి 5: మండలంలోని మూడు ప్రధాన రహదారుల మరమ్మతులకు రూ.65 లక్షలు మంజూరయ్యాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కోనాం నుంచి ఖండివరం, అప్పలరాజుపురం మీదుగా విజయరామరాజుపేట వరకు, తురువోలు నుంచి వాకపల్లి మీదుగా తెనుగుపూడి వరకు, తురువోలు నుంచి చీడికాడ వరకు రహదారుల మరమ్మతుల కోసం ఈ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థం

మాడుగుల రూరల్, మార్చి 5: మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో మంగళవారం వీరాంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లబండ్ల పరుగు పందేలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, శానాపతి గంగాధర్, కరణం రాము, గ్రామ పెద్దలు తదితరులు పర్యవేక్షించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల, మార్చి 5: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాదరావు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

బైలపూడిలో 330 మందికి వైద్య సేవలు

చీడికాడ, మార్చి 5: మండలంలోని బైలపూడి గ్రామంలో మంగళవారం 330 మందికి వైద్య సేవలు అందించారు. మంగళవారం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరి ప్రారంభించారు. ముందుగా ఐసీడీఎస్ స్టాల్స్‌ను పరిశీలించారు. శిబిరంలో ముగ్గురు వైద్యులు పాల్గొని రోగులకు తనిఖీలు చేసి, అవసరమైన మందులను అందించారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అట్టల పంపిణీ

దేవరాపల్లి, మార్చి 5: మండలంలోని పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను అట్టలు, పరీక్షల సామగ్రిని అందించారు. ఎంఈవో బి.పడాల్‌దాస్ చేతుల మీదుగా మంగళవారం వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కేవీ.రమణ పాల్గొన్నారు.

కొత్తపెంట వీఆర్వోపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

దేవరాపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని కొత్తపెంట భూసర్వేలో క్షేత్ర స్థాయిలో వీఆర్వో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గ్రామానికి చెందిన బర్ల నాయుడు కొంత మంది గ్రామస్థులతో కలిసి మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తల్లితండ్రుల పేరు మీద భూమి ఉంటే, వారి పిల్లల పేర్లపై కొంత మందికి, మరి కొంత మందివి నిబంధనల పేరుతో మార్పు చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నేతలు మంగునాయుడు, వెంకటరావు, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభపై సమీక్షా సమావేశం

చీడికాడ, మార్చి 5: అనకాపల్లి జిల్లా పిసినికాడ గ్రామంలో ఈ నెల 7న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభపై మండల ప్రత్యేకాధికారి బి.మహేశ్వర్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, వీఆర్వోలు, వెలుగు సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఏపీవో చీకటి శ్రీనివాసరావు, ఎంపీపీ కురచా జయమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.